Ananth & Ananth Series



# సూర్యదేవర రామ్ మోహన రావు

THE NUMBER ONE BEST SELLING AUTHOR



# ఐ విట్‌నెస్

# ఐ విట్‌నెస్

SUCCESS CAN BE ACHIEVED ONLY THROUGH REPEATED FAILURES, AND INTROSPECTION.

- Siochiro Honda

JAPAN

న్యూఢిల్లీ : మధ్యాహ్నం సరిగ్గా పన్నెండు గంటలయింది.

రాష్ట్రపతి భవనంలోని దర్బారు హాలు, దేశ, విదేశీ ప్రముఖులతో, పారిశ్రామిక వేత్తలతో, ఎందరో సెలబ్రటీలతో రాజకీయ నాయకులతో, సినీ ప్రముఖులతో, వివిధ రంగాలకు చెందిన మేధావి వర్గాలతో కళకళ్ళాడుతోంది.

**అంతటా కొత్తఉత్సాహం... చిరునవ్వులు... పరామర్శలు... పలకరింపులు... ఉద్వేగం... ఉద్రిక్తత... మరికొన్ని నిమిషాల్లో, కొత్త ప్రధాని, తన మంత్రివర్గ సహచరుల జాబితాను ప్రకటించనున్నారు.**

మంత్రివర్గ ప్రమాణోత్సవ కార్యక్రమాన్ని, దేశవ్యాప్తంగా రిలే చెయ్యడానికి దూరదర్శన్ సిబ్బంది ఆఘమేఘాలమీద ఏర్పాట్లు చేశారు.

దూరదర్శన్ ఏర్పాటు చేసిన ఆర్క్‌లైట్ల వెలుగుల్లో దర్బారు హాలు, వెండిపూత పూసినట్లుగా మెరిసిపోతోంది.

అంతవరకూ దేశాన్ని పాలించిన వామపక్షాల కూటమిలో, ప్రధాని పదవికోసం తలెత్తిన వివాదంవల్ల, ఆ కూటమి మెజార్టీ కోల్పోవటంతో నెలరోజుల క్రితం, దేశంలో మధ్యంతర ఎన్నికలు జరిగాయి.

ఆ ఎన్నికల్లో ప్రతిపక్షపార్టీ అధికారంలో కొచ్చింది.

రాష్ట్రపతి హుందాగా లోనికి అడుగుపెట్టటంతో దర్బారు హాలు నిశ్శబ్దాన్ని ఆశ్రయించింది. ఆ పక్కన దర్జాగా చిరునవ్వులు చిందిస్తున్న ప్రధాని...

రాష్ట్రపతి, ఎత్తయిన సింహాసనమ్మీద ఆసీనులయ్యారు. ఆయనకు కొంచెం దూరములో ప్రధాని... పక్కన ప్రధాని కార్యాలయ ఉన్నతాధి కారులు, చేతుల్లో ఫైల్స్‌తో నుంచున్నారు.

డెబ్బయియేళ్ళ ప్రధాని గుంభనమైన వ్యక్తి- ఆరితేరిన రాజకీయ కురువృద్ధుడాయన, అందుకే మంత్రిపదవులు ఎవరిని వరిస్తాయో అనూహ్యాంగా ఉంది.

అతి సన్నిహితులక్కూడా తెలియకుండా రహస్యంగా ఉంచాడాయన.

అంతవరకూ పవర్ లాబీల్లో నలిగిన ఊహాగానాలు. పటాపంచలైపోయే క్షణమది.

రాష్ట్రపతి భవన్ బయట... మంత్రి పదవులు వరించి, విచ్చేసే తమ నాయకులకు భారీ ఎత్తున ఆహ్వానం పలికేందుకు వేల సంఖ్యలో గుమిగూడిన జనం.

బయట, లోపలా-

ఎక్కడా, అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా, కట్టుదిట్టమైన పోలీసు పహరా...

రాష్ట్రపతి భవనంపైన నిఘాకళ్ళతో తిరుగుతున్న హెలికాప్టర్-

రాష్ట్రపతి అనుమతితో, అంతవరకూ తన చేతిలోవున్న ఫైల్‌ని తన కార్యదర్శికి అందజేశారు ప్రధాని.

ఆ ఫైల్‌ను తీసుకొని, ఆ కార్యదర్శి మైకు ముందుకు నడిచాడు.

*   *   *   *   *

సరిగ్గా 12-05 నిమిషాలు...

అశోకా ఇంటర్నేషనల్ హోటల్‌లోని సూట్‌నెం. 116 ముందున్న లాంజ్‌లో కొంతమంది ప్రముఖ వ్యక్తులు గుస, గుసగా ఏవో చర్చించుకుంటున్నారు.

అందరి కళ్ళలో ఆత్రుత... ఆ కళ్ళు సూట్ డోర్‌వేపు మాటిమాటికీ చూస్తున్నాయి.

సూట్ లోపల, విశాలమైన బెడ్‌రూంలో-

డ్రెస్సింగ్ టేబుల్ ఎదురుగా, చురకత్తిలాంటి మీసాల్ని దువ్వెనతో దువ్వుకొని, టైనాట్‌ని సర్దుకుని, నిలువెత్తు అద్దంలో తనని తాను మరొకసారి చూసుకున్నారాయన.

ఆయన...

వాసిరెడ్డి హరికృష్ణమనాయుడు.

ఆరడుగుల, రెండంగుళాల హరికృష్ణమనాయుడు పసిడి పూతపూసిన పాలరాతి విగ్రహంలా ఉన్నారు... దృఢమైన శరీరం... మెలిదిరిగిన కండరాలు, విశాలమైన కళ్ళు... పొడవాటి ముక్కు...

నీలంరంగు కోటులో మిలమిలా మెరిసిపోతున్నాడాయన.

గత పదిహేనేళ్ళుగా భారతదేశపు బిజినెస్ వరల్డ్‌లో ది గ్రేట్ డిక్టేటర్ అని అనిపించుకున్న హరికృష్ణమనాయుడు-

పుట్టింది రాయలసీమలోని ఓ కుగ్రామంలో, సెటిలైంది మద్రాసులో. సివిల్ కంట్రాక్టర్‌గా జీవితాన్ని ప్రారంభించిన హరికృష్ణమనాయుడు, ఏరక్

కాంట్రాక్టరుగా మద్రాసులో తన ఎంపైర్ని బిల్డప్ చేసారు. మద్రాస్ కేంద్రంగా చేసుకొని, ఆంధ్రా, ఒరిస్సా, వెస్ట్బెంగాల్, మహారాష్ట్రలో ఎన్నో బిజినెస్సుల్ని స్థాపించాడు.

ఆయన పట్టిందల్లా బంగారమైంది... చేపట్టిన బిజినెస్ కోట్లకు అధిపతిని చేసింది.

మొన్నటివరకూ ఆయన కింగ్మేకర్...

కానీ నేడు... దేశంలో అత్యధిక మెజార్టీ, ఆరులక్షల ఓట్ల ఆధిక్యతతో గెలిచిన పార్టీ... ఎం.పి... మరి రేపు...? మరొక క్షణం తర్వాత-

హరికృష్ణమనాయుడు-

కళ్ళజోడు సర్దుకుంటూ, దూరంగా నిల్చున్న వ్యక్తివేపు చూస్తూ-

"టైమయినట్టుంది.. వెళ్దామా..." చేతి వాచీని చూచుకుంటూ అన్నారాయన.

"ప్రమాణోత్సవం స్టార్టయి... అయిదు నిమిషాలైంది... ఇప్పుడే మెసేజ్ వచ్చింది..."

"మంత్రి పదవులు ఎవరికొచ్చాయో... ఏమన్నా తెలిసిందా?" గంభీరంగా అడిగాడాయన.

"మీకు ఇస్తారని... అనుకుంటున్నారు... ఇవాళ పేపర్స్ కూడా అలాగే రాసాయి..." నెమ్మదిగా చెప్పాడాయన.

"మనం... మనవాళ్ళు... అనుకోవడంకాదు... పి.ఎం... అనుకోవాలి... పి.ఎం... దృష్టిలో... నేనుంటే ముందుగా ఒక్కమాటైనా నాకు చెప్పేవాడాయన" ముందుకడుగేస్తూ అన్నాడు హరికృష్ణమనాయుడు.

"మన... పి.ఎం... గారి గురించి... ఎవరికి తెలీదు... టీ... తాగడానిక్కూడా అరగంట ఆలోచించి మరీ తాగుతాడని... ఆమధ్య ఎవరో కామెంట్ చేసారు... మీ ఫ్రెండ్ గురించి మీకు తెలీదా..." ఆయన వెనకే అడుగేస్తూ అన్నాడాయన. ఆయన పేరు సూర్యసాగర్. ఆయనకో యాభై ఏళ్ళుంటాయి... ఒకప్పుడు హరికృష్ణమనాయుడు కాలేజీ మేట్ సూర్యసాగర్- ఆ తర్వాత ఆంతరంగీకుడు. ప్రస్తుతం హరికృష్ణమనాయుడు పర్సనల్ లాయర్.

"పి.ఎం... బలవంతమ్మీద పోలిటిక్స్‌లోకొచ్చాను- పిలిచి సీటిస్తే కాదనలేకపోయాను... ఎం.పి నయ్యాను... పవర్‌లో ఉన్న పార్టీలో... ఉండడం మంచిదే... ఏ పవర్ ఎప్పుడుపయోగపడుతుందో... ఎవరికి తెల్సు... ఎంత పి.ఎం... నాకు ఫ్రెండయినా, ఫస్ట్‌టైమ్... ఎం.పి... అయిన వ్యక్తిని నేను. పి.ఎం... నాకు మినిస్ట్రీ ఇస్తాడని నేననుకోను. అడిగినపుడల్లా కాదనకుండా, పార్టీకి ఫండ్ ఇచ్చాను. దానికి కృతజ్ఞతగా ప్రధాని నాకు ఎం.పి సీటిచ్చాడు. అంతకంటె ఆశించడం తప్పు. ఈ రాజకీయాల్ని నేనెప్పుడూ నమ్మను. నమ్మితే, వున్నదీపోతుంది, వుంచుకొన్నదీ పోతుంది."

సూట్ బయటకొచ్చాడు హరికృష్ణమనాయుడు-

బయటకు రాగానే దూరంగా నుంచున్న ఆప్తజనం... గబగబా దగ్గరకొచ్చి, అభినందనలు తెలియజేయడం ప్రారంభించారు.

అందులో ఎక్కువమంది ఇండస్ట్రియలిస్ట్‌లే వున్నారు.

వాళ్ళమధ్య ఓ కాకీయూనిఫారం కన్పించడంతో, ఆశ్చర్యంతో ఆ వ్యక్తిని చూసారు నాయుడు.

"సౌత్‌జోన్ డి.సి.పి...మిస్టర్ అగర్వాల్... మిమ్మల్ని కలవడానికొచ్చారు" పక్కనున్న పి.ఎ. చెప్పాడు.

"నన్ను కలవడానికి పోలీసఫీషియల్స్ ఎందుకొస్తున్నారు" అన్నట్టుగా లాయర్ సూర్యసాగర్ వేపు చూసారు నాయుడు.

"ఊరక రారు... పోలీసులు" నవ్వుతూ అని, అగర్వాల్ వేపు చూసాడు సూర్యసాగర్.

"కంగ్రాచ్యులేషన్స్ సార్... ఒక అరగంట తర్వాత మీరు హోం మినిస్టర్ సర్" ఏదో చెప్పబోయాడు అగర్వాల్.

"నువ్వెవరో... నాకు తెలుస్తూనే వుందిలే... హోం ఇస్తే... నిన్ను మర్చిపోను. ఇవ్వకపోయినా మర్చిపోను. ఎందుకంటే ముందుగా వచ్చి పలకరించావ్... లిఫ్ట్‌వేపు నడవబోయి, పక్కకు తిరిగారు హరికృష్ణమనాయుడు.

"అమ్మాయి దగ్గర్నించి ఫోనేమైనా వచ్చిందా?"

"నిన్న నైట్ చెయ్యడమే."

ఒక్కక్షణం ఆలోచనలో పడ్డాడాయన.

"ఫ్లయిట్ ఎక్కేముందు ఫోన్ చెయ్యమని చెప్పాను. మరోపని చెయ్యండి... బహుశా అమ్మాయి ఏ క్షణంలోనైనా రావచ్చు. మన సూట్లో ఎవర్నయినా వుంచండి."

"మనవాళ్ళు వుంటారు... అమ్మాయిని రాష్ట్రపతి భవన్‌కి తీసుకు రావడానికి ఏర్పాట్లు చేసాను."

"గుడ్... వెరీగుడ్... అమ్మాయికి టైమ్‌సెన్స్ ఎక్కువ. సాధారణంగా లేటు కాదు" కూతురు జ్ఞాపకం రావడంతో ఉత్సాహం వచ్చింది హరికృష్ణమ నాయుడికి.

ఇండికేటర్‌లో కన్పిస్తున్న ఫోర్ నెంబర్లవేపు చూస్తూ లిఫ్టముందు నించున్నారాయన.

అదే సమయంలో కన్పిస్తున్న ఫోర్‌నెంబర్లవేపు చూస్తూ లిఫ్ట్‌ముందు నించున్నారాయన.

అదే సమయంలో–

హరికృష్టమనాయుడు సూట్లో ఫోన్ మోగింది.

అప్పుడు ఆ సూట్లో ఎవరూలేరు.

సూట్‌కు కొంచెం దూరంలో లిఫ్ట్‌కోసం ఎదురుచూస్తున్న హరికృష్ణమ నాయుడికి ఆ ఫోన్ శబ్దం స్పష్టంగా వినిపించింది. ఆయన దృష్టి కొన్ని గంటలుగా ఫోన్ మీదే వుంది.

క్రితం రాత్రి కూతురు ఫోన్ చేసినపుడు ఆయన సూట్లోలేడు. మూడు నెలలైంది కూతుర్ని చూసి– ఎలక్షన్లముందు చూడడమే. ఎందుకో తెలీదు...

గత వారం రోజులుగా, ఆయనే పని చేస్తున్నా కూతురే జ్ఞాపకం వస్తోంది. లిఫ్ట్ దగ్గర్నించి వెనక్కొచ్చి ఫోన్ అందుకున్నారు హరికృష్ణమనాయుడు.

"హలో... నాయుడు హియర్..."

కూతురు స్వరాన్ని వినడానికి ఉబలాటపడుతున్నాడు హరికృష్ణమ నాయుడు.

"కృష్ణమనాయుడు..." అవతలి వ్యక్తి స్వరం, తనని ఏకవచనంతో సంబోధించడంతో కృష్ణమనాయుడు మైండ్ ఎలర్టయింది.

"హు ఆర్ యూ...?" కృష్ణమనాయుడు ఒకింత కోపంగా ప్రశ్నించారు.

"నీకున్న శత్రువుల్లో పవర్‌ఫుల్ శత్రువుని..." అవతలి వ్యక్తి గొంతు చాలా పొగరుగా వుంది.

"అయితే...?"

"నీకు నేను ఫస్ట్ టైమ్ ఫోన్ చేసాను– ఇదే లాస్ట్ టైమ్ అది చెప్పడానికే ఈ ఫోన్... YOU MEAN IT... OK" అవతలి వ్యక్తి గొంతు హుషారుగా వుంది.

"నీలాంటి ఎనిమీస్ నాకు చాలామందున్నారు. శత్రువులతో ఆడుకోవడం... నా హాబీ... నన్ను ఢీకొనాలనుకుంటే, దమ్ముంటే ఎదురుగా రా..." కోపంగా అన్నారు హరికృష్ణమనాయుడు.

"అంత మొనగాడివా నాయుడూ..." అవతలి వ్యక్తి నవ్వు నాయుడిని కిర్రెక్కించింది.

ఆయన ముఖం ఎర్రగా మారిపోయింది.

"పదికోట్లు పార్టీ ఫండ్‌గా ఇచ్చి, టిక్కెట్ కొనుక్కొన్నట్టుకాదు, నన్ను ఢీ కొనడం. నువ్వు పాలిటిక్స్‌లోకి ఎందుకు అడుగుపెట్టావో నాకు మాత్రమే తెలుసు. మరో అరగంటలో నువ్వు హోం మినిస్టరవుతున్నావ్... ఆ విషయం నీకు తెలీదు, నాకు తెలుసు."

"అది చెప్పడానికే ఫోన్ చేశావా!"

"కాదు. జాగ్రత్తగా విను... నువ్వు మినిస్టర్ కావడానికి వీల్లేదు. అందులోనూ హోం మినిస్టర్ కావడానికి అసలు వీల్లేదు, ప్రమాణ స్వీకారోత్స వానికి నువ్వు వెళ్ళడానికి వీళ్ళేదు. గుర్తుంచుకో... దీనికి భిన్నంగా ఏం జరిగినా... ఫైనల్ రిజల్ట్ కొన్ని గంటల్లో నీకు తెలుస్తుంది... సీ...యూ..."

అవతలి వ్యక్తి ఫోన్ రిసీవర్ని పెట్టేసాడు.

ఎన్నో గేమ్స్‌ని అవలీలగా ఆడిన హరికృష్ణమనాయుడి యాభైఆరేళ్ళ జీవితంలో డైరెక్టుగా వచ్చిన ఫోన్ బెదిరింపు అదొక్కటే...

ఇండస్ట్రియలిస్టుగా ఎప్పుడూ ఇలాంటి ఫోన్లు తనకి రాలేదు. పాలిటిక్స్‌లోకి అడుగుపెట్టిన తొలి క్షణంలో...?

కొన్ని క్షణాలు ఆలోచనలో పడ్డాడు హరికృష్ణమనాయుడు.

బిజినెస్ వరల్డ్‌లో వున్న శత్రువులు తెలుసు... వాళ్ళ బలాబలాలు స్పష్టంగా తెలుసు. వాళ్ళు అదును చూసి, తనని దెబ్బకొట్టడానికి ఎదురు చూస్తున్న విషయం కూడా తెలుసు.

రాజకీయం– కనబడని శత్రువుల మయసభ.

పాలిటిక్స్‌లో ఇలాంటి కాల్స్ చాలా సహజం... ఆ ఆలోచన రావడంతోనే, కొన్ని నిమిషాలసేపు సీరియస్‌గా ఆలోచించిన హరికృష్ణమనాయుడు పూర్తిగా రిలాక్స్ అయిపోయి సూట్లోంచి బయటకొచ్చారు.

ఆత్రంగా, అస్పష్టంగా లోన జరిగిన సంభాషణని అంచనా వెయ్యడానికి ప్రయత్నిస్తున్న సూర్యసాగర్‌వేపు చూసి–

"ఇట్స్...ఎ...రాంగ్‌కాల్...కమాన్" ఆయన భుజంమీద చేయి వేస్తూ గబగబా ముందుకు నడిచారు హరికృష్ణమనాయుడు.

మరో మూడు నిమిషాల తర్వాత–

హోటల్ అశోకా పోర్టికోలోంచి ఒక అయిదు కార్లు రాష్ట్రపతి భవన్‌వేపు దూసుకుపోయాయి. ఆ కార్ల మధ్యలోని బ్రౌన్‌కలర్ కారులో కూర్చున్న హరికృష్ణమ నాయుడు మెదడులో కనబడని ఎనిమీ చేసిన ఫోన్ కాల్ రింగవుతూనే వుంది.

*　　*　　*　　*　　*

సరిగ్గా - 12.17 నిమిషాలు.

రాష్ట్రపతి భవన్‌లోని దర్బారు హాల్లో ప్రవేశించారు హరికృష్టమనాయుడు. అప్పటికి ఎనిమిది మంది అభ్యర్థులు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసారు.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎం.పీలు కూర్చున్న ప్రదేశానికి వెళ్ళబోతూ– మైకులో చటుక్కున తన పేరు వినబడడంతో, తలెత్తి పార్టీ సహచరులవేపు నవ్వుతూ చూసి, ఉప్పొంగిన ఉత్సాహంతో–

వేదికవేపు అడుగేసారు హరికృష్ణమనాయుడు... ఆయన ప్రమాణ పత్రం చదువుతున్నంతసేపూ హాలంతా జయ జయధ్వానాలు, కరతాళాల్తో మారుమోగి పోయింది.

ప్రమాణ పత్రం చదివాక. సంతకాల కార్యక్రమం అయిపోయాక, రాష్ట్రపతితో కరచాలనం చేసి, కృతజ్ఞతలు తెలియజేసి–

ప్రధానివేపు అడుగువేసారు హరికృష్ణమనాయుడు.

"కంగ్రాచ్యులేషన్స్– మిస్టర్ నాయుడూ..." మనసారా నవ్వుతూ షేక్‌హేండ్ ఇచ్చారు ప్రధాని...

"గమ్మత్తుగా నన్ను పొలిటీషియన్‌ని చేశారు... అంతే గమ్మత్తుగా హోంమినిష్టర్‌ని చేశారు..." అన్నారు హరికృష్ణమనాయుడు ఎగ్జైట్ మెంట్‌తో.

"మీమీద నాకు నమ్మకం వుంది నాయుడుగారూ... అందుకే మీకు "హోం" ఇచ్చాం. ఇండస్ట్రియలిస్ట్‌గా మీ సక్సెస్ మాకు తెలుసు. కరెక్ట్ పొలిటీషియన్‌గా మిమ్మల్ని తీర్చిదిద్దుకోవాలంటే... స్వదేశంలోను, విదేశంలోను పొంచివున్న జాతివ్యతిరేకులకు సవాల్‌గా నిలిచి, మన శత్రువుల్ని అణగదొక్కే ప్రయత్నం మీరు చేయాలి. మీకు ఆ కెపాసిటీ ఉందని నమ్ముతున్నాం... అందుకే కొత్తవారైనా మీకు హోంశాఖనిచ్చాం..." నవ్వుతూ అన్నారాయన.

ఆ మాటకు హరికృష్ణమనాయుడు కృతజ్ఞతగా చూసాడు.

"Every body is bound to make a few enemies, especially if they do their jab right, we cant please every one" అన్నాడు నాయుడు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని, కృతజ్ఞతని కనబరుస్తూ, ప్రధాని నాయుడు భుజం తట్టారు– స్నేహపూర్వకంగా, నాయుడు తన శత్రువుల్ని ఎలా ఎదుర్కొన్నాడో, ముప్పైఏళ్ళుగా నాయుడ్ని తెలిసిన వ్యక్తిగా ప్రధానికి తెలుసు!

''EVERY BODY BOUND TO MAKE FEW ENEMIES'' అకస్మాత్తుగా తన నోటివెంట వచ్చిన మాటకు తానే ఆశ్చర్యపోయాడు హరికృష్ణమ నాయుడు FEW ENEMIES...

వేదిక దిగుతున్న హరికృష్ణమనాయుడుకి పార్టీసభ్యుల కేరింతలు, పార్టీ మిత్రుల అభినందనలు ఏవీ విన్పించడంలేదు.

అంత ఆనంద సందోహం మధ్య తీవ్ర ఆలోచనలో మునిగిపోయా డాయన.

పోలిటిక్స్ విశాలమైన ఎరీనా లాంటిది– శత్రువుల్ని గుర్తుపట్టడం కష్టం– "ప్రమాణ స్వీకారానికి నువ్వు వెళ్ళడానికి వీల్లేదు. గుర్తుంచుకో. దీనికి భిన్నంగా ఏం జరిగినా, ఫైనల్ రిజల్ట్ కొన్ని గంటల్లో నీకు తెలుస్తుంది..." సడన్‌గా ఫోన్ హెచ్చరిక గుర్తుకొచ్చింది.

ముసురుకున్న ఆలోచన్లతో, తనకు కేటాయించిన సీట్లో కూర్చున్నా రాయన.

మనిషిగా అభినందనలు అందుకుంటూనే వున్నా, మనసు... అనేక రకాలుగా ఆలోచిస్తోంది.

తను శత్రువుల్ని ఎదుర్కోగలడు.

తన తెలివితేటల ఉక్కుపాదంతో, శత్రువుల్ని అణగద్రొక్కేయగలడు... ఆ కాన్ఫిడెన్స్ తనకుంది. ఇండస్ట్రియలిస్ట్‌గా ఆ ఎక్స్‌పీరియన్స్ తనకుంది.

శత్రువు ఒంటికన్నుతో చూస్తే, తను వెయ్యికళ్ళతో చూడగలడు... శత్రువును పసిగట్టడంలో, తన అంచనా ఎప్పుడూ తప్పుకాదు. మొత్తం యాభైఆరుమంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. కేబినేట్ ర్యాంక్ మంత్రులు పద్దెనిమిదిమంది... మిగతా మంత్రులు స్టేట్ మంత్రులు... డిప్యూటీ మంత్రులు...

మొత్తం కార్యక్రమం పూర్తయ్యేసరికి నలభై అయిదు నిమిషాలు పట్టింది. ప్రమాణ స్వీకారం అయిపోయాక–

మంత్రి వర్గ సహచరులతో ప్రధాని ఫోటో దిగారు. ఆ తర్వాత రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి నూతన మంత్రివర్గానికి తేనీటి విందునిచ్చారు.

అక్కడే–

కొత్త హోంమంత్రి మొట్టమొదటి అధికారిక పర్యటన కార్యక్రమం ఖరారైంది. పార్టీ ఎం.పీ.లు ఏర్పాటుచేసిన అభినందన సభ జైపూర్‌లో జరపాలని నిశ్చయింపబడింది.

తనకు సన్నిహితులైన ఇండస్ట్రియలిస్టులు కూడా వుండటంతో, ఆ ప్రోగ్రామ్‌ని కాదన లేకపోయారు హరికృష్ణమనాయుడు.

*    *    *    *    *

హరికృష్ణమనాయుడు...

హోంమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి రెండు గంటలైంది. ఢిల్లీ నుంచి జైపూర్...

జైపూర్ నుంచి మద్రాసు ప్రయాణం.

సూట్లో అరగంట రెస్టు తీసుకొన్నాడాయన.

అప్పటికీ నాలుగైదుసార్లు కూతురు గురించి సూర్యసాగర్‌ని అడిగాడాయన. సూర్యసాగర్, అహమ్మదాబాదుకు ఫోన్‌చేసి బయలుదేరినట్లు తెల్సుకున్నాడు.

"ఒకసారి-ఎయిర్‌పోర్టుక్కూడా ఫోన్‌చేసి కనుక్కోండి" తిరిగి అన్నాడాయన. హరికృష్ణమనాయుడి కెందుకో ఉన్నఫళాన కూతుర్ని చూడాలని వుంది. అందుకే అంత ఆరాటపడిపోతున్నాడు. వెంటనే ఎయిర్ పోర్టుక్కూడా ఫోన్ చేసాడు సూర్యసాగర్. ఢిల్లీకి వచ్చే అహమ్మదాబాద్ ఎయిర్‌బస్... రెండు గంటలు లేటు... మరో పది నిమిషాల్లో జైపూర్‌కి బయలుదేరాలి. ఆయన మనసు కూతురి కోసం... కూతురిని చూడాలనే కోరికతో విలవిల్లాడిపోయింది. అయినా తప్పని మర్యాదని పాటించాలి. హరికృష్ణమనాయుడు గౌరవార్ధం, లగ్జరీ రైలు ప్యాలెస్ ఆన్ వీల్స్‌ను బుక్ చేసారు.

సూట్లోంచి బయటికొస్తూ, సూర్యసాగర్‌తో చెప్పారు హరికృష్ణమనాయుడు- "అమ్మాయి ఇక్కడకొస్తే... జైపూర్‌కి వచ్చేయమని మెసేజ్ ఇవ్వండి. అందుకు తగిన ఏర్పాట్లు కూడా చేయండి" శాసనాధికారం మొదలైంది.

అశోకా హోటల్ మొత్తం, పోలీస్ బందోబస్తుతో నిండిపోయింది.

పోర్టికోలో కొచ్చిన హోంమంత్రిని పోలీసు ఉన్నతాధికారులు తమని తాము పరిచయం చేసుకున్నారు- కంటికి రెప్పలా చుట్టూ పోలీసు పహారా మొదలైపోయింది.

అభిమానులు, మిత్రులు, అనుచరగణం జయ, జయధ్వానాలతో అశోకా హోటల్ దద్ధరిల్లిపోయింది.

దగ్గరకొచ్చి, దండలు వేయడానికి కుమ్ములాడుకొంటున్న అభిమాన సందోహాన్ని పోలీసులు లాఠీలతో అడ్డుకుంటున్నారు.

''THIS IS CALLED POWER...'' నవ్వుతూ తనలో తాను అనుకొన్నారాయన.

డి.ఐ.జి. స్థాయి అధికారొకరు కారు డోర్ తెరిచి పట్టుకొన్నారు. కారెక్కబోతూ, దూరంగా ఓ వ్యక్తిని చూసి నవ్వి, దగ్గరకు రమ్మన్నట్టుగా సంజ్ఞ చేశారు హరికృష్ణమనాయుడు. ఆ వ్యక్తి ఢిల్లీ సౌత్ జోన్ డి.సి.పి అగర్వాల్.

"కారెక్కండి మిస్టర్ అగర్వాల్..."

మొట్టమొదటిసారి తనని కంగ్రాచ్యులేట్ చేసిన పోలీస్ అధికారి అగర్వాల్... అందుకే హోంమంత్రి అగర్వాల్‌ని చూడగానే పోల్చుకున్నారు.

"థాంక్యూసర్!" అగర్వాల్, హోంమంత్రి హరికృష్ణమనాయుడు కారు వెనకనున్న సెక్యూరిటీ కార్లోకెక్కాడు గర్వంగా. హోంమంత్రి స్వయంగా పిల్చి, ఒక పోలీసధికారిని కారెక్కమనడం కొంతమంది ఉన్నతస్థాయి పోలీసధికారులకు నచ్చలేదు.

పిల్చింది... కారెక్కమంది సాక్షాత్తూ హోంమంత్రి. అందుకే మౌనంగా హోంమంత్రికి సెల్యూట్ చేస్తూ, కోపాన్ని దిగమింగుతూ వుండిపోయారు వాళ్ళు.

గొప్ప జీనియస్సులు కూడా అకస్మాత్తుగా తప్పులు చేస్తుంటారు.

అలాంటి భయంకరమైన ఒక తప్పు హోంమినిస్టర్ హరికృష్ణమనాయుడు చేసారు.

ఆయనకావిషయం తెలీదు– మరో రెండు నిమిషాల తర్వాత– అశోకా హోటల్నించి కార్లు రైల్వేస్టేషన్ కేసి దూసుకుపోయాయి.

*　*　*　*　*

సరిగ్గా నలభై నిమిషాల తర్వాత–

హోటల్ అశోకా ఇంటర్నేషనల్ పోర్టికోలో ఒక టాక్సీ వచ్చి ఆగింది.

అందులోంచి...

దిగ్రేట్ ఇండస్ట్రియలిస్ట్... హోంమంత్రి హరికృష్ణమనాయుడు కూతురు ముక్తానంద దిగింది హుందాగా.

*    *    *    *    *

ముక్తానంద... బ్లాక్ బ్యూటీ... నల్లగా అందంగా వుంటుంది.

చూడగానే ఇటాలియన్‌లా వుంటుంది. పారిస్ నుంచి తెచ్చిన పాలరాతి విగ్రహానికి ప్రాణం పోసినట్టుగా వుంటుంది. కొంతమందిని చూడగానే గోవాలోని సాయం సంధ్య, మైసూరు ప్యాలెస్‌లోని అందమైన రవివర్మ చిత్రాలు జ్ఞాపకాని కొస్తాయి.

ఒక అందమైన అమ్మాయిగా, ముచ్చటైన నల్లటి అమ్మాయిగా–ముక్తానందను చూడగానే భావుకులకు ఆ పోలికలన్నీ గుర్తుకొస్తాయి.

ఒక్కొక్కప్పుడు విశాలమైన ఆమె కళ్ళు ప్రేమధారలు వర్షిస్తే, మరొక్కప్పుడు చంద్ర నిప్పులు కురిపిస్తాయి అన్న విషయం కొంతమందికే తెలుసు. ముఖ్యంగా హరికృష్ణమనాయుడుకి బాగా తెలుసు.

*    *    *    *    *

హోటల్ రిసెప్షన్ కౌంటర్ దగ్గరకొచ్చిన ముక్తానంద దగ్గరకు పరుగు లాంటి నడకతో ఒక వ్యక్తి వచ్చాడు.

"గుడ్ ఈవెనింగ్ మేడమ్... మైనేమీజ్ ప్రవీణ్. మీ కోసం వెయిట్ చేసి, డాడీ జైపూర్ వెళ్ళారు" చెప్పాడు ప్రవీణ్ కంగారు పడిపోతూ–

"జైపూర్ ఎందుకెళ్ళారు?" వెంటనే అడిగింది ముక్తానంద.

"అభినందన సభకి మేడమ్!"

"డాడీకే పోర్ట్‌ఫోలియా ఇచ్చారు?"

"హోం... మేడమ్."

ఆ మాటకు ముక్తానంద పెదవుల మీద చిరునవ్వు వెల్లివిరిసింది.

"ఒకవేళ మీరు జైపూర్‌కి రాలేకపోతే డాడీ మిమ్మల్ని మద్రాసుకు రమ్మనమని చెప్పమన్నారు" మళ్ళీ చెప్పాడు ప్రవీణ్.

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/I+Witness](http://kinige.com/book/I+Witness)**

* * *